తన తల్లి మోసపోయిందనుకున్న ఆ అనాధకి తెలిసిన నిజం?

# అమ్మ ఉత్తరం

ఎన్.కె. నాగేశ్వరరావు కథ

నాకీరోజు నిద్ర రావడంలేదు...

"కన్నా... కన్నా... కన్నా..." అంటూ ఎవరో దగ్గరగా గొంతెత్తి పిలుస్తూన్నట్టు... రెండు చేతులూ సాచి వేగిరం రమ్మంటున్నట్టు అనిపిస్తోంది.

మంచంమీంచి లేచి అర్ధరాత్రి... ఆ చీకటిలో కిటికీలోంచి బయటకు చూడసాగేను.

అంతా శూన్యం. ఏమీ కనిపించడంలేదు నా కళ్లకి.

కనీసం అమ్మ రూపాన్నయినా దర్శిద్దామంటే... ఊహూ... అసలు అమ్మెలా వుంటుందో తనకు తెలిస్తేగా.

ఈ పాతికేళ్లలో అమ్మను ఏదన్నా దెబ్బ తగిలినప్పుడు 'అమ్మా!' అంటూ తలుచుకోవడంతప్ప మరెప్పుడూ ఆమె గురించి ఆలోచనే రాలేదు.

అనాధ శరణాలయంలో...

ఆనంద్ అనే పేరుతో పెరిగిన తనకు ఇలా ఒక్కసారిగా అమ్మ గురించిన ఆలోచనలు ముట్టుముట్టడం వెనుక ఉదయం జరిగిన సంఘటనే కారణం.


☆ ★ ☆

సూర్యభగవానుని పసిడికిరణాలు నేలపై తాకగానే అవి వెలుగు ప్రసారాలుగా మారుతున్నవేళ...

అనాధ శరణాలయంలోంచి నాకు సంబంధించిన లగేజీతో బయటకు కదలబోతుండగా 'ఆనంద్' అన్న పిలుపుతో వెనక్కి తిరిగాను.

గుమ్మంలో మాతాజీ నిల్చొని వున్నారు.

ఆమె చేతిలో ఒక కవరుంది. ఆమె నావంక చూస్తూ "నిన్ననే ఈ కవరు



సంగతి గుర్తుకొచ్చింది. ఎప్పుడో పాతికేళ్ల క్రిందట ఈ కవరు నా చేతిలోకి వచ్చింది. అప్పట్నుంచీ చాలా భద్రంగావే దాచాను. దీనిని నీకు చేర్చాలి. అదీ నువ్వు వ్యక్తిగా మారి, బ్రతుకుతెరువుచూసుకున్న తర్వాతే. దీనిని నేను తీసుకున్నప్పుడు నువ్వింకా పుట్టలేదు. అయినా ఈ లోకంలోకి అడుగు పెట్టే ఒక జీవికోసం ఉద్దేశించిన ఈ

కవరులో ఏముందో నాకు తెలీదు. దీనిని తీసుకున్నప్పుడు మాత్రం నేను ఒకందుకు భయపడ్డాను. ఇచ్చిన వ్యక్తి మాట నిలబెట్టుగలవాని? కానీ నాకిప్పుడు ఆనందంగా వుంది. ఈ కవరు నీకు చేరితే ఇదిచ్చిన వ్యక్తే కాదూ... నేను చాలా సంతోషపడతాం..."

మాతాజీకి అలసట అనిపించిందేమో, కొద్దిసేపు ఊపిరి తీసుకోవడానికన్నట్టు ఆగారు.

అరవై నిండిన వయస్సు ఆమెది. శరణాలయం మొత్తం ఆమె పర్యవేక్షణలోనే నడుస్తోంది. ఆమెతోపాటు అక్కడ మరో పన్నెండుగురు ఆయాలున్నా ఎక్కువ పనులు మాతాజీ చేతులమీదుగానే జరుగుతాయి

మాతాజీ మాటలు నాకు అర్థంకాక అయోమయంగా చూశాను.

నేను భూమ్మీద పడుతుండగానే నాకు చెప్పమని కవరు ఎవరు ఇచ్చారు? అదీ నాకు ఉద్యోగం దొరికిన తర్వాతే ఇమ్మనడం ఏమిటి? అసలా కవరు ఇచ్చిన వ్యక్తికీ నాకూ గల సంబంధం?

ఇలా ఎన్నో ప్రశ్నలు నన్ను ముట్టుముట్టాయి.

మాతాజీ నా ముఖంలోకి చూసి నవ్వారు.

తెల్లగా... స్వచ్ఛంగా వుండే ఆ ముఖం వెండి తీగెల్లా వుండే ఆమె జుత్తు... నుదుట రూపాయి కాసంత ఉన్న ఎర్రని బొట్టు 'మాతాజీ'ని చూసినవారికి చెయ్యెత్తి నమస్కరించాలనిపించేవిధంగా వుంటుంది ఆమె రూపం.

ఆమె కవరు పట్టుకుని లోనికి నడిచారు.

నేను నా లగేజీ వరండాలోనే వదిలిపెట్టి వారిని అనుసరించేను.

"కూర్చో ఆనంద్!" కుర్చీ చూపించి అన్నారు మాతాజీ.

చేతులు కట్టుకుని వినయంగా నిల్చుని వున్నాను నేను.

పాతికేళ్లుగా నాకదే అలవాటు.

ఊహ వచ్చాక నేను చూసిన మొదటి వ్యక్తి మాతాజీ.

నాలాంటి ఎందరో శరణాలయంలో వున్నారు.

అందరికీ అమ్మ మాతాజీ!

"ఇప్పుడు నువ్వు స్వతంత్రుడివి అయ్యావు... నీ కాళ్లమీద నువ్వు నిలబడగలుగుతున్నప్పుడు ఇంకా నా ముందు చేతులు కట్టుకుని నిలబడనక్కర్లేదు"

నేను కూర్చోలేదని గమనించి అన్నారు ఆమె.

మాతాజీ మాటకు ఎదురాడే ధైర్యం ఎప్పుడూ లేదు.

అందుకే మరో మాట ఆమె చెప్పకుండా కూర్చున్నాను.

ఆమె గొంతు విప్పారు మళ్లీ.

"ఆనంద్... ఈ రోజుతో ఈ శరణాలయంతో నీకున్న బంధం తెగిపోతూంది. పాతికేళ్లు నీ మంచి చెడ్డలు చూసిన ఈ శరణాలయంపట్ల నీకు అభిమానం వుండక పోదు. నువ్వెక్కడ వున్నా నీ క్షేమ సమాచారాలు తెలుపు. అంతేకాదు! నీకు తోచింది... నీ సంపాదనలో మిగిలింది... ఇక్కడ నీలాంటివారికోసం పంపు... ఇదిగో ఈ కవర్ నీకోసం దాచి వుంచబడింది... తీసుకో..."

మాతాజీనుండి కవర్ అందుకున్నాను. ఎందుకో నా చేతులు వణుకుతున్నాయి. అందులో ఏముందోనన్న ఉద్వేగం, దానికి ఎవరు తనకోసం ఇచ్చారన్న సందేహం కదలాడ్డంవల్లనేమో నా అంతరంగమంతా ఆందోళనగా వుంది.

"ఆనంద్... ఇంతవరకూ నీనుండి దాచింది ఇప్పుడు చెబుతున్నాను. ఆ కవరు ఎవరిచ్చారో తెలుసా?... ఆమె ఎవ్వరోకాదు మీ అమ్మగారే" మాతాజీ చెబుతుంటే అక్కడ ఒక్కసారే పిడుగు పడ్డట్టు చలించి పోయాను.

అమ్మ... అమ్మ... అమ్మ...

తనని అనాథగా శరణాలయంలో పెరగ డానికి కారణమైన అమ్మ... తనకోసం ఆ కవర్లో ఏం దాచింది? అదీ తను పుట్టకముందే మాతాజీ చేతికి ఎందుకు అందించింది?

నా ముఖంలో కదులుతున్న అనే భావాల ను ఇట్టే చదివేసిన మాతాజీ మళ్ళీ చెప్పడం మొదలుపెట్టారు.

"నాకు ఇంకా గుర్తే. మీ అమ్మకు అప్పుడు ఇరవై ... ఇరవై ఒకటో వుంటోం ది వయస్సు. సన్నగా రెక్కపాయులా వుంది" ఒక్కసారి మాతాజీ గతాన్ని గుర్తుకు తెచ్చు కుంటున్నారు. ఒక్కో సంఘటనా నెమరువే సుకుంటున్నారు. "మనిషి ఎర్రటి ఎర్రుపై నా, ఎందుకో తెల్లగా పాలిపోయినట్లుంది. ఆరోజు సాయం సమయంవేళ ఇక్కడకు వచ్చింది. నవమాసాలూ నిండిన ఆమె అలా ఒంటరిగా మా అనాథ శరణాలయంకు ఆశ్చర్యం అనిపించింది.

అదే అడిగాను.

తనకు తల్లీ, తండ్రీ, అన్నదమ్ములు... అక్కచెల్లెళ్లు... భర్త... అత్తమామలు... ఆడపడుచులూ అందరూ వున్నా వారంద రూ లేనట్టేనని చెప్పింది.


శరణాలయంలో చేరి, తనకు చేతనైన పని చేసుకుని తన కడుపులోని బిడ్డ అనాథ కాకుండా సాకుతానని అంది. 'మీకు అభ్యం

## ప్యారడైజ్

"మిల్టన్ గురించి నీకు తెలిసింది చెప్పరా వినోద్!" అడిగాడు ఇంగ్లీషు మాస్టారు.

"ఏముంది మాస్టారు! పెళ్లి చేసుకున్న తర్వాత 'ప్యారడైజ్ లాస్ట్' రాశాడు! భార్య చనిపోయాక 'ప్యారడైజ్ రిగైన్' రాశాడు!" అన్నాడు వినోద్.

—ఎం.ఆర్.శకుంతల (సికిందరాబాద్)



తరం లేదుకదా? అని అడిగింది.

నేను సమాధానం చెప్పేంతలోనే ఆమెకు పెయిన్స్ ప్రారంభమయ్యాయేమో... బాధతో మెలికలు తిరిగిపోవడం... విన్నగా కేకలు పెట్టడం చేయడంతో వెంటనే ఆమెను అదే మీ అమ్మను ఆస్పత్రిలో చేర్పించాం.

డాక్టర్‌గారు ఆమె బలహీనంగా వుండడం చూసి...

ఈమెకు ప్రసవం సక్రమంగా జరిగే అవకాశం లేదు. సిజేరియన్ చేయక తప్పదు అన్నారు. ఈమె తరఫువారు ఎవరైనా సంతకం చేయాలని కాగితాలు ఇచ్చారు. ఎవరున్నారని? నేనే వాటిపై సంతకాలు చేశాను.

మీ అమ్మ అప్పుడే... ఆపరేషన్ గదిలోకి తనని తీసుకువెళ్లేముందే ఇదిగో నీ చేతిలో వున్న ఆ కవర్ని అప్పుడు నా చేతిలో పెట్టింది.

''దీనిని నా బిడ్డకు ఇవ్వండమ్మా... అదీ ఆ బిడ్డ పెరిగి పెద్దయి తన కాళ్లమీద తాను నిలబడ్డప్పుడే ఇవ్వండి'' అంది.

తనకు బ్రతుకుమీద ఆశలేదని, ఆపరేషన్ తర్వాత తాను చనిపోయినా, తన బిడ్డ మాత్రం బ్రతకాలని కోరుకుంటున్నానని అంది.

మీ శరణాలయంలో అనాథగా చేరి నా బిడ్డను అనాథ కాకుండా చేద్దామనుకున్నాను. కానీ, భగవంతుడు నా 'ఆశ' ఇక్కడా నెరవేర్చడంలేదు... బాధగా చేతులెత్తి దణ్ణం పెట్టింది.

నేను బాధ పడకని, అంతా మంచే జరుగుతుందని అనునయించాను.

తర్వాత ఆమెను ఆపరేషన్ గదిలోకి తీసుకెళ్లారు.

అంతా ఆమె అనుకున్నట్టే జరిగింది.

నువ్వు భూమ్మీద పడ్డావు. ఆమె ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఆమెకు అంత్యక్రియలు చేసి.... పసిగుడ్డుగా వున్న నిన్ను శరణాలయంకు తెచ్చి పెంచాం.

ఈ పాతికేళ్ల కాలంలో నీ అమ్మ గురించి ఎవ్వరూ రాలేదు. ఎవరైనా వస్తారని, వాళ్లకి ఆమె గురించి చెప్పి, నిన్ను వాళ్లకు అప్పగిద్దామని ఎదురుచూశాను చాలాకాలం. కానీ నేననుకున్నట్టు జరగలేదు.

ఆరోజు మీ అమ్మ అన్నట్టే 'తనకు అందరూ వున్నా ఎవ్వరూ లేరన్న' మాటే నిజమనిపించింది'' చెప్పడం ఆపారు మాతాజీ.

నా పరిస్థితి చాలా దారుణంగా వుంది.

ఇంతకాలం అనాథగా ఎవ్వరూ లేనివాడిగా పెరగడం వేరు.

కానీ ఒక్కసారిగా తనకూ మిగతావారిలాగే అందరూ వున్నారని... తానే వారెవ్వరికీ చెందకుండా దూరంగా అనాథగా బ్రతుకుతున్నాననే వాస్తవమే నాకు మింగుడు పడ్డంలేదు.

చాలాకాలంగా నేను ఒకలా ఆలోచించేవాడిని.

తన తల్లిని ఎవరో మోసంచేసి, తల్లినిచేసి వుంటారని... పెళ్లి కాకుండా తల్లి కావడం సమాజం హర్షించదు కనుక తనను ఆ తల్లి కని ఈ అనాథ శరణాలయంలో వదిలి తిరిగి తను కన్నెపిల్లగా చెలామణి అయిపోవడానికి వెళ్లిపోయి వుంటుందని' అనుకునేవాడు.

ఓహ్! తన ఊహలెంత వికృతమైనవో

మాతాజీ చెప్పిందాన్నిబట్టి తెలుస్తోంది.

జీవితంపట్ల విసిగిపోయి వుంటుంది అమ్మ.

అందుకే అందరికీ దూరంగా వచ్చేసి వుంటుంది.

అసలెందుకు ఆమెకు అలాంటి పరిస్థితి కలిగింది?

అందుకు సమాధానం తన చేతిలోని వున్న కవర్లోనే వుంటుందేమో?! ఆత్రంగా ఆ కవర్ని విప్పాను.

ముత్యాల్లాంటి అక్షరాలు...

పాతికేళ్ల క్రిందట రాసినా ఆ అక్షరాలు కాంతిచెడకుండా అందంగా మెరుస్తున్నాయి.

ఆ అక్షరాల్నిండా నిండిన అమ్మ రూపమే కనిపిస్తుంటే చదవడం ప్రారంభించాను.

"కన్నా... కన్నా... కన్నా...

నేను నీ అమ్మని... నీవు నా ప్రేమ తెంచుకుని పుట్టినా... ప్రేమ పాశం తెంపుకుని నిన్ను వదిలి వెళ్లిపోయిన అమ్మను...

ఈ లోకంలో మోసాలకు... అయినవాళ్ల నిరాదరణకు లొంగి... కృంగి... చివరికి నిన్ను అనాధగా చేసి వెళ్లిపోయిన అమ్మను...


నామీద కోపగించేయకు కన్నా..

నిన్ను నాన్నకు... తాతయ్యకు... నానమ్మలకు... అత్తయ్య... మామయ్యలకు... చివరికి అమ్మమ్మ తాతయ్యలకు కూడా చెందకుండా చేసినందుకు నన్ను నిందించకు...

నా పట్లేకాదు — నీపట్లకూడా నేనింత కఠినమైన నిర్ణయం తీసుకోవడానికి కారణం వుంది కన్నా..

మీ నాన్నగురించి చెప్పనా... అతని దృష్టిలో ఆడదంటే ఆటబొమ్మ... డబ్బు తెచ్చే మిషను... అతనికి లేని వ్యసనాలు లేవు. అయినా భరించాను. అడిగినప్పుడల్లా డబ్బు తెచ్చి అందించాను. ఆడ పిచ్చితో బయటనుంచి అమ్మాయిల్ని తెచ్చుకుని నా కళ్లముందే వాళ్లతో మలుకుతున్నా భరించాను.

కానీ — నన్ను వదిలించుకుని మరో



ఆడదానికి అన్యాయం చేయాలనుకున్న అత ని ప్రయత్నాన్ని ఎదిరించాను. అంతే — ఒకరోజు మీ నాన్న... అతని తల్లీ తండ్రీ అంటే నీ తాతయ్య, నానమ్మ... నీ మేనత్తలు ఇద్దరూ అంతా నామీద విరుచుకు పడ్డారు. నిండుగర్భిణిని అనికూడా కనికరం లేకుండా — మీ నాన్న నామీద కిరోసిన్ పోస్తే —

నేను కదలకుండా మీ తాతయ్య పట్టుకు న్నాడు.

నా అరుపులు... కేకలు బయటకు వినిపించకుండా రేడియో సౌండ్ పెంచడం లో నీ మేనత్తలు పడ్డారు.

మీ నాన్న అగ్గిపుల్ల గీసి వెలిగించాడు.

తల తప్ప మెదడులేని ఆ అగ్గిపుల్ల మండుతోంది. తనతోపాటు నన్నూ మండి ంచడానికి అది తాపత్రయపడుతోంది.

నాలో ఆవేశంతోపాటు, ఎలా వచ్చి చేరిందో పిచ్చి బలమూ వచ్చింది. అందర్నీ విదిలించుకుని అన్నింటినీ తప్పించుకుని, ఎలా తప్పించుకున్నానో నాకే తెలీదు.

నా కడుపులో నువ్వు వున్నావు...

నీ తల్లిమీద ఇంత అఘాయిత్యం జరుగు తున్న సంగతి నీకెలా తెలుస్తుంది కన్నా...

అందుకే — నాకోసం కాదు... నీకోసం. .. నిన్ను బతికించుకోవడంకోసం... నీకు జన్మనివ్వడంకోసం... నేను అక్కడినుంచి బతికి బయటపడ్డాను.

అలా... పుట్టింటికి చేరాను.

జరిగింది చెప్పాను.

మీ అమ్మమ్మ తాతయ్యలు విట్టూర్పులు విడిచారు.

ఆడపిల్ల పెళ్లయిన తర్వాత 'ఆడ'పిల్లేగా నీ 'ఈడ'పిల్లకాదని అన్నారు. నిన్ను ఆదరి స్తే మిగిలిన ఆడపిల్లల పెళ్లిళ్ల ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఇప్పటికే నీకు కట్నం క్రింద నీ మొగుడు కోర్కెల క్రింద చాలా డబ్బే ముట్టజెప్పాం... ఇక నీ బతుకు నువ్వు బతకడం తప్ప మా బతుకుల్లో చేరి ఇబ్బంది పెట్టకన్నారు.

అక్కడినుంచి వెనుదిరిగాను. కనీసం అన్నయ్యలైనా ఆదరిస్తారని అక్కడకెళ్లాను. వాళ్లూ మొండిచెయ్యే చూపించారు. అన్నలే అలా అంటే ఇహ వదినలు ఏం చేయగలరు. వాళ్లూ చెయ్యేత్తేశారు.

ఇలా వెళ్లిన ప్రతిచోటా లేదనిపించుకుని ... అయినవాళ్లచేతే వెళ్లగొట్టించుకుని... కన్నా... నిన్ను కడుపులో మోస్తూ కడుపుకి ంత తిండికోసం ఎన్ని కష్టాలు పడ్డానో...

ఎంతమంది దృష్టిలోంచి నన్ను నేను తప్పించుకుని నీకు బతుకునివ్వడానికి పరిత పించానో...

ఈ వికృత నరరూప రాక్షసులు సమాజ ంలో బతకడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డానో ఇక్కడ వ్రాయడం మొదలుపెడితే ఒక గ్రంథమే అవుతుంది.

అంతా వ్రాద్దామన్నా కన్నా... నాకు ఓపిక లేదే!

అలసిపోయాను... ఓడిపోయాను.

అందుకే... అందుకే నిన్ను వీడిపోతు న్నాను.

నీకు జన్మనిచ్చేంతవరకూ ఈ ప్రాణం

వుండాలని నాకు జీవంపోసిన ఆ దైవాన్ని వేడుకుంటున్నాను.

నిన్ను కలకాలం కాపాడుకుంటూ, నీకు ఈ ఉత్తరం చేరే అవకాశం కల్పించమంటూ కూడా నేను ఆయన్ని ప్రార్థిస్తున్నాను.

కన్నా...

నువ్వు ఇంకా నా కడుపులోనే వున్నావు.

నీవు ఆడపిల్లవో... మగపిల్లాడివో నాకు తెలీదు.

నువ్వు ఎవరివైనా కన్నా...

నా కన్నా... నా కోరిక ఒక్కటే... అది తీర్చాలి కన్నా...

ఈ సమాజంలో మగాడికి ఉన్న శత్రు వులకంటే ఆడపిల్లకున్న శత్రువులే ఎక్కువ. ఆడదానికి ఆడదేకాదూ, ప్రతి మగాడూ శత్రువే. ప్రతి ఆడదీ ఇలా ఆడదానికి శత్రువుగా, ప్రతి మగాడూ ఆడదానికి పగవాడుగా ఎందుకు మారతారూ!

చెడ్డ చెల్లి... చెడ్డ భార్య... చెడ్డ ప్రియురాలు వుండవచ్చేమోగానీ ఎవ్వరికీ చెడ్డ తల్లి వుండదు.

ప్రతి ఆడదాన్నీ తల్లి అనుకుంటే ఆడదైనా మగాడైనా తాము చెడ్డవాళ్లుగా మారరు.

కన్నా... నీవు 'చెడు' కాకు. అదే నా కోరిక..''

ఉత్తరం చదవడం పూర్తయింది.

నా కళ్లు కన్నీటి కెరటాలయ్యాయి. గుండె బరువెక్కిన ఇసుకమూటలా వుంది. గొంతు పూడుకుపోయింది.

మాతాజీ ఆ ఉత్తరంలోని విషయాన్ని అంతర్నేత్రంతో గ్రహించినట్లు నావంక అనునయంగా చూశారు.

చాలా భారంగా అక్కడ్నుంచి నాకోసం సృష్టించుకున్న ప్రపంచంలోకి వచ్చేశాను. నాతోపాటు అమ్మ ఉత్తరం.

☆ ★ ☆

ఇంతకాలం అమ్మ లేదని బాధపడ్డాను. నాకు ఇప్పుడు ఆ బాధలేదు. ఎందుకంటే 'అమ్మ ఉత్తరం' సజీవంగా నాకు చేరడమే! అమ్మ భౌతికంగా ఈ లోకంనుంచి వెడలిపోయినా... ఆమె మానసికంగా నా హృదయంలో ఉత్తరంతో నిక్షిప్తం అయిపోయింది. అమ్మ రూపం ఇప్పుడు నా కళ్లకు స్పష్టంగా కనిపిస్తోంది.

అమ్మ... అమ్మ... అమ్మ...

ఈ లోకంలో ప్రతి ఆడదీ తన తల్లికాదూ!

ఈ మనసు మాలిన్యం కాకుండా ఈ హృదయంలో 'చెడు' నిండకుండా వుంటే అమ్మ ఉత్తరం సాధించే విజయం అంత విజయం ఈ సృష్టిలో మరొకటి లేనే లేదు.

అప్పుడే —

మరో గంటలో తెలవారుతున్నంతలో నాకు ప్రశాంతంగా నిద్రపట్టింది. ఆ నిద్రలోనే రేపటి వేకువకు తూరుపున వాకిలి తీసి అమ్మ నిల్చొని పిలుస్తూ కనిపించింది.

'కన్నా.. కన్నా... కన్నా...' అంటూ.

☆ ★ ☆